ఇడియెట్

హావిస్

ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుని కుర్చీలో వెనక్కి చేరగిల బడ్డాడు రాజు.

ఆ ఉత్తరం రాసింది అతని పినతండ్రి కూతురు కాత్యాయని. ''నేను చాలా కష్టాల్లో వున్నాను. నీ సహాయం కావాలి. రెండు రోజులు సెలవుపెట్టి రాగలవా అన్నయ్యా? ఒకప్పుడు నీదయవల్ల నాకు స్వంత ఇల్లు ఏర్పడింది. ఆ ఇల్లు ఇప్పుడు నువ్వు నిలబెట్టాలి'' అని వుంది అందులో.

రాజుకు మతిపోయినంత పనైంది.

''ఏంచేశాడీ మూర్తిగాడు? ''అనుకున్నాడతను

మూర్తి అతని ఆబాల్య స్నేహితుడు. తమ స్నేహబృందంలో అందరికన్నా డబ్బు కలిగిన కుటుంబంలో పుట్టినవాడు. కాత్యాయనికి,అతనికి పెళ్లికావడానికి కారకుడు రాజే.

మూర్తి అంటే స్నేహబృందంలో అందరికీ ఏవ రీతమైన వాత్సల్యం, గౌరవం వుండేది. అంటే మూర్తి చాలా గొప్పవాడనీ, అతీంద్రియశక్తులు కలవాడని అర్థం కాదు. అమాటకొస్తే ఏదో ఒక సందర్భంలో మూర్తి చేతిలో అడ్డమైన తిట్లు తినని స్నేహితుడు వాళ్ల బృందంలో లేడు. ఆ తిట్లు వాళ్లకి అమృత సమానంగా ఉండేవి.

కాలేజీల్లో చదువుకునే రోజుల్లో మూర్తికి మిత్రబృందం పెట్టుకున్న ముద్దుపేరు 'దక్షిణ నాయకుడు' అని. మూర్తి అందమైనవాడుకాదు. లావుగా, నల్లగా వుండేవాడు. దాదాపు మోకాళ్ల వరకు వచ్చే చొక్కా తొడుక్కుని, గొట్టాం పంట్లాం తొడుక్కునేవాడు. కాలికి పది లక్షల కుట్లుపడ్డ చెప్పులుండేవి. 'బోలెడంత ఉన్నవాడివి. నీకిదేం దవుర్భాగ్యంరా?' అని ఎవరైనా అడిగితే 'నాకు షోకుకుందుకు పోనిద్దూ' అనేవాడు తేలిగ్గా. షోకులేకపోతే పింగుబోయిరి—కనీసం సిట్‌గానైనా ఉండడేం? అని విసుక్కునే వారు మిత్రులు.

అలాంటి మూర్తికి కాలేజీలో అందాల రాణులుగా గణుతికెక్కిన ఆడపిల్లలో చాలా సన్నిహితమైన స్నేహం వుండేది. ఆ స్నేహంలో 'అందరూ అనుకునే అంశం' లేకపోవడం మిత్ర బృందానికి మరింత ఆశ్చర్యం కలిగించేది. 'ఇంతనిగ్రహంతో ఎలా వుండగలుగు తున్నావురా?' అని ఎవరైనా అడిగితే' ఈ ప్రపంచంలో సెక్సు తప్ప మరేంలేదా?' అని తారాజువ్వలా లేచేవాడు.

వాళ్లతో—అంటే ఆడపిల్లలతో—కలిసి మూర్తి తిరుగుతుంటే అందరికీ మల్లికి రాజుకు కూడా అసూయ కలిగేది. ఆ అసూయతోబాటు ఒక భయంకరమైన అనుమానం కూడా కలిగేది! 'కొంపదీసి ఈ వెర్రివెధవని వాళ్లుఆటలు పట్టించడం లేదుగదా?'

ఆ అనుమానం నిర్ధారణ చేసుకోవడానికి రాజుకి ఎన్నడూ అవకాశం చిక్కలేదు. నేరుగా మూర్తినే అడిగితే అతను తిట్టి పోతాడని తెలుసును గనుక అప్రయత్నం కూడా అతను చెయ్యలేదు.

చదువులై పోయింతర్వాత అందరూ నౌకరీలో కుదురుకున్నారు. అందరికి పెళ్లిళ్లయి పోయాయి కూడ ఆపెళ్లిళ్లయి కూడా అంతే. మూర్తి ఎక్కడుంటే అక్కడ బంతిపూల రథాల కొలువు వుండేది. అతను చెప్పే కబుర్లకి పొట్టలు చెగిలేట్టు నవ్వుతూండేవారు వాళ్లు. బుద్ధావతారం లాగాఉండే మూర్తిలో అంతటి హాస్యచతురత ఎలా దాంకొని వుందా అన్నది మిత్రులకి ఎన్నడూ విడని మిష్టరీల్లో ఒకటి.

మిత్రులందరికీ పెళ్లిళ్లయి పిల్లలు పుట్టు కొస్తున్నా మూర్తి బ్రహ్మచారిగానే ఉండి పోయాడు. మిత్రులందర్లోకీ అతనో

నిక్కువ సన్నిహితంగా వుండే రాజా ఒకటి రెండు సార్లు కేకవేశాడు కూడా "మీ అమ్మగారి కోరిక తీర్చడం కోసమైనా చేసుకోరా! ఎన్నాళ్ళిలావుంటావు? "అని మూర్తి నవ్వేసి వూరుకునేవాడు.

అలాంటిది ఒకనాడు.

అప్పుడు రాజా గుంటూర్లో పనిచేస్తున్నాడు. ఆరోజు ఆఫీసు వదిలాక అతను బయటికి వొస్తుంటే మూర్తి ఎదురొచ్చాడు. అప్పటి మూర్తి అవతారం చూసి రాజా కొయ్యబారి పోయాడు. పూర్తి టెర్లిన్ డ్రెస్‌లో వున్నాడు మూర్తి. వేలికి తెల్ల వొంటిరాయి ఉంగరం పెట్టుకున్నాడు. తళతళ మెరిసిపోతున్నబూట్లు తొడిగాడు. క్రాపు నున్నగా దువ్వాడు. సెంటు కూడా రాసుకున్నాడు.

"ఏమిట్రా ఆ కోడి చూపు? నేనే మూర్తిని" అన్నాడు నవ్వుతూ.

"ఎంత బావున్నావురా వెధవా?" అన్నాడు రాజా ప్రీతిగా.

"సరిసరి! దిష్టి తగుల్తుందేమో?..... పద. హొటల్‌కి పోదాం" అన్నాడు మూర్తి.

ఇద్దరూ హొటల్‌కి నడిచారు. మూర్తి నడకలో కూడా మార్పు వచ్చింది. గాలిలో తేలిపోతున్నట్లు నడుస్తున్నా డతను. హొటల్లో కూచుని, కావల్సినవి ఆర్డ రిచ్చాక "ఏమిట్రా విశేషాలు? ఏమంటుంది మా చెల్లెలు?" అన్నాడు మూర్తి.

"మా అన్నాయికి ఎప్పటికి బుద్ధొస్తుంది— అని అడుగుతుంది" అన్నాడు రాజా కసిగా.

మూర్తి పకపక నవ్వాడు. "ఆల్‌రైట్ అబ్బాయ్ మూర్తికి బుద్ధి వచ్చేసింది" అన్నాడు.

"అంటే......?" అన్నాడు ఆశగా రాజా.

"అవును బ్రదర్! నా అన్వేషణ ఫలించింది"

ఆనందం పట్టలేక మిత్రుడి భుజం పట్టుకు వూపేశాడు రాజా. కొద్ది క్షణాలకి తెప్పరిల్లి "ఎవరా అదృష్టవంతురాలు?" అన్నాడు.

"చెబుతాను. నీ టిఫిన్ కానియ్" అన్నాడు మూర్తి.

ఇద్దరూ తిండి ముగించి బయటికి వచ్చాక "సస్పెన్స్‌తో చచ్చిపోతున్నాను. ఎవరో చెప్పరా బాబూ?" అని రాజా వేధించగా మూర్తి చెప్పాడు.

ఆ అమ్మాయి పేరు కూడా అతనికి తెలియదు. తాము చదువుకున్న కాలేజికి వెళ్ళే దోవలోవున్న ఆకుపచ్చ డాబా యిల్లు వాళ్ల నివాసం. మూర్తి చెప్పిన ఈ వివరాలు విని రాజా తెల్లబోయాడు.

"ఇడియెట్" అన్నాడు.

"నువ్వేమన్నా అను బ్రదర్! నాకు ఆఅమ్మాయి కావాలి. లేకపోతే పెళ్ళే అక్కర్లేదు" అన్నాడు మూర్తి.

"ఏడవలేకపోయావ్. వాళ్లకులమేమిటో గోత్రమేమిటో తెలియకుండా, ఈ గోలేమిట్రా? అన్నాడు రాజా నిరుత్సాహంగా.

"కులం – సంగతి ఎవడికి పట్టిందోయ్?"

"నీకు పట్టకపోతే వాళ్ళకి పట్టదా?"

"నాన్సెన్స్! నే నంత హీనుణ్ణా?"

"నీ బొందలే!......పోనీ ఆ అమ్మాయికి నువ్వు తెలుసా?"

"నన్ను నాలుగైదుసార్లు చూసింది."

"అసలిదంతా ఎలా తటస్థ పడిందిరా?"

మూర్తి సవివరంగా చెప్పాడు. కాలేజి పక్కన సందులోవున్న ఒక స్నేహితుడ్ని కలుసుకో డానికి ఒక సాయంత్రం పూట వెడుతుంటే, ఆ డాబామీద జెడ ముందుకు వేసుకుని నిలబడి వున్న అమ్మాయి కనిపించింది. సాయంత్రపు నీరెండ పడి ఆమె ముఖం బంగారపు రంగులో ప్రకాశించింది ఆక్షణాన. మూర్తి కన్నార్పకుండా ఆమె వంకే చూశాడు. ఆమె కూడా అతని వంక చూసింది.

ఆ తర్వాత వరసగా వారం రోజులపాటు అతను ఆ యింటి వైపు వెళ్లాడు. ఆమె రోజూ కనిపిం పించింది. రోజూ అతని వంక అలాగే చూసింది. నమ్మకం చాలని మూర్తి రెండు మూడు తడవలు ఆ యింటి పక్కకి వెళ్ళి కూడా చూశాడు. ఆమె అటుకూడా రావడంతో అతనికి నమ్మకం బల పడింది. ఒకరోజున ఆమెనవ్వుతూ, తననిచూపిస్తూ పక్కనున్న స్నేహితురాలితో ఏదో చెప్పడంతో మూర్తిలో ఆశకి బీజాలు పడ్డాయి.

అదీకథ.

రాజా అంతావిని "ఇంతకీ ఆ అమ్మాయి నువ్వంటే యిష్టపడుతుందంటావు?" అన్నాడు.

"షటప్!" అన్నాడు మూర్తి కోపంగా.

రాజా నవ్వి "అది కాదురా! నువ్వు రోజూ హాజరు కావడం చూసి ఆ అమ్మాయికి ఎగతాళిగా వుందని ఎందుకు అనుకోవు?" అన్నాడు.

"ఎగతాళి దేనికి?"

రాజా ఇక ప్రశ్నించడం మానుకుందామనుకుని "ఇక ఏం చెయ్యదల్చుకున్నావ్?" అన్నాడు.

"ఆ అమ్మాయి తండ్రి రైల్వేలో పనిచేస్తున్నాడు. అతన్తో మాట్లాడాలి."

"అంటే? మీఅమ్మాయిని నాకిచ్చిచెయ్యండి అని అడుగుతావా?" అన్నాడు రాజా ఆశ్చర్యంగా.

"ఏం? తప్పా?"

"తప్పని కాదు గాని, వాళ్ళు వప్పుకోకపోతే?"

"శకునపక్షి మాటలు మాట్లాడకు. ఎందుకు ఒప్పుకోరు.? నాకన్నా మంచి అల్లుడు దొరుకుతాడా వాళ్లకి?"

నవ్వాపుకున్నాడు రాజా. "సరే అయితే! వెళ్ళి అడుగు" అన్నాడు.

మూర్తి ఒక్క క్షణం ఊరుకుని "నేను ఒక్కడినీ వెళ్లలేను రాజా! నువ్వుకూడా రావాలి" అన్నాడు.

"ఏడిసినట్టుంది."

"తప్పదు."

ఈ వ్యవహారం బెడిసిపోతే తన పేరు బయటికి రానివ్వనని వాగ్దానం చేయించుకొని, స్నేహితుడితో కలిసి బెజవాడ వచ్చాడు రాజా. తీరా సదరు అమ్మాయి తన పినతండ్రి కూతురు కాత్యాయనని తెలియడంతో రాజాకి కొండంత బరువు తీరినట్లని పించింది.

పిలిచినా ఏనాడూ రాని రాజా, పిలవకుండానే దిగబడడం అతని పినతండ్రి జగన్నాధానికి, పిన్నికి, కాత్యాయనికీ చాలా ఆనందం కలిగించింది. రాజా, కాత్యాయనిని చూసి అప్పటికి ఏ నాలుగైదేళ్ళో అయివుంటుంది. తనకి చెల్లెలవుతుంది గనుక గాని అదే మరోపిల్ల అయితే "ఏం బావుందిరా యీ అమ్మాయి?" అని కొట్టిపారేసేవాడే అతను. చివరికి ఆసాయంత్రం, పినతండ్రితో తను వచ్చిన రాచ కార్యం ముచ్చటించాడు అతను.

"నా అభ్యంతరం ఏముంది? దానిని కూడా అడిగి చూడాలి కదా?" అన్నాడు జగన్నాధం అంతా విని.

"అడిగి ఎప్పుడు చెబుతావు?"

"రెండుమూడు రోజుల్లో— ఉత్తరం రాస్తానులే" అన్నాడాయన.

ఆయన ఎందుకో సందేహిస్తున్నాడని తోచింది రాజాకి. అదే మాట పైకి అన్నాడు.

"అంటే...!" నసిగా డాయన.

"కట్నం కానుకల సంగతా?"

"అబ్బెబ్బె! అదేం లేదు."

"మరి?"

"మీ ఫ్రెండ్ దానికి నచ్చుతాడా అని."

రాజాకు నవ్వొచ్చింది. "అదే అయితే నువ్వు చెప్పి వొప్పించు. వాడి వరకు పూచీ నాది. మనిషి చాలా మంచివాడు. పోనివ్వడం మంచిదికాదు." అన్నాడు.

"నువ్వింతగా చెప్పాల్రా?.. రెండురోజుల్లో కబురుచేస్తాములే?" అన్నాడాయన.

రాజా, ఆ తర్వాత అందరి దగ్గరా సెలవు తీసుకుని బయటికి వచ్చాడు.

నాలుగడుగులు వేశాక "ఏమన్నార్రా?" అన్నాడు మూర్తి.

రాజా అతని వంక చూశాడు. మనిషి ముఖంలో దైన్యం కనిపించింది.

బాబాయి చెప్పింది మూర్తికి చెప్పాడు రాజా.

"హోశ్! ఇంతేనా? అయితే త్వరలోనే ఆ.." అర్థోక్తిలో సిగ్గుపడ్డట్లుగా ఆగిపోయాడు మూర్తి.

ఆ తర్వాత రెండురోజులు గడిచాయి. మూర్తి మళ్ళా గుంటూరు వచ్చి రాజాను కలుసుకున్నాడు. అప్పటికింకా జగన్నాధం ఏమీ రాయలేదు. మూర్తి మాట కాదనలేక తిరిగి బెజవాడ వచ్చాడు రాజారావు.

"అమ్మాయి యిష్టంగా మాట్లాడడంలేదు రాజా!" అన్నాడు జగన్నాధం.

ఆమాట విన్నప్పుడు మూర్తి ముఖంలో కనిపించిన దైన్యం రాజాను కృంగదీసి వేసింది. "ఆవిడంత అప్సరసేమిట్రా? ఆవిడ కాకపోతే ఆవిడ తల్లో జేజెమ్మ దొరుకుతుంది." అని రాజా అంటే "థాంక్స్ రాజా! వస్తాను" అనేసి వెళ్ళిపోయాడు మూర్తి.

ఆతర్వాత రెండునెలలు గడిచిపోయాయి. ఒకరోజున ఉన్నట్టుండి జగన్నాధం గుంటూరు దిగబడ్డాడు. ఆఫీసులోనే రాజాని కలుసుకుని "నీతో పని వుండి వచ్చాన్రా" అన్నాడు.

రాజుకి పినతండ్రితో సవ్యంగా మాట్లాడా లనిపించలేదు.

"ఏమిటి విషయం?" అన్నాడు ముభావంగా.

"మీ స్నేహితుడి సంగతి."

"మూర్తి సంగతా?"

"ఊ! వాళ్ళింటికి పోయొద్దాం వస్తావా?" అన్నాడు.

రాజు బాబాయి వంక పరిశీలనగా చూసి, "సంబంధం కోసమా?" అన్నాడు.

"ఔన్రా! కాత్యాయని వొప్పుకున్నది. నీకు వీలుంటే యివాళే బయలుదేరి వెడదాం." అన్నాడాయన.

"రమ్మంటే వస్తాను. కాని సంబంధం కుదురుతుందని గ్యారంటీ యివ్వలేను" అన్నాడు రాజు.

"అవేం!" అన్నాడాయన భయంగా.

"ఔను బాబాయ్! వాడు బంగారపు పిచ్చిక. ఈపాటికి మరో సంబంధం కుదిరిపోయుంటే?"

"అంతేనంటావా?" అన్నాడాయన నిరాశగా.

"అంతేగా?.. అయినా పోయొద్దాంలే. రేపు ఆదివారం. ఇద్దరం వెడదాం." అన్నాడు.

"అతని క్కూడా రేపు సెలవేనేమో?"

"వాడికి రోజూ సెలవే!" అని "పద పోదాం" అన్నాడు రాజు.

సంబంధం కోసం జగన్నాధం వచ్చాడని రాజు చెప్పేసరికి మూర్తి ఆనందంతో డాన్స్ చేసినంత పని చేశాడు. "చూశావా? ఆరోజున నేను చెబితే టుకాయించావు. ఇప్పుడేమంటావు?" అన్నాడు.

రాజారావు నవ్వుకున్నాడు.

పెళ్ళయి పోయిం తర్వాత హానీమూన్‌కి బెంగుళూరు వెళ్ళిన మూర్తి అక్కడ నుంచి రాసిన ఉత్తరం చదివిన రాజుకి ఆనందం కంటనీరు తిరిగింది. "కవిత్వం రాయడం నాకు యిష్టంలేదని, కొంతవరకు అసహ్యం అనికూడా నువ్వెరుగుదువు, కాని రాజూ! మీ చెల్లెలి వడిలో పడుకున్నప్పుడు నాకు ఎక్కడ లేని కవిత్వమూ వస్తున్నది. ఎంత

ఇడియెట్

అదృష్టవంతుణ్నోయ్ నేను?" అని రాశాడు మూర్తి.

రాజు ఆలోచనలని తెంపి వేస్తూ ప్యూన్ మాట వినపడింది. "అయ్యగారు పిలుస్తున్నారు సార్!" అన్నాడు తను. రాజు లేచి ఆఫీసర్ గదిలోకి వెళ్ళాడు. ఆయన యితన్ని చూసి చిన్నగా నవ్వుతో "వాట్ మిస్టర్ రాజూ! పరధ్యానంలో మునిగి వున్నావు? మీ యింటికి మళ్ళా కొత్త మెంబరెవరన్నా....." అన్నాడు.

రాజు సిగ్గుగా నవ్వి "లేదు సార్" అన్నాడు.

"ఆ నవ్వే చెబుతోంది. గుడ్‌లక్!.. ఇంతకు పూర్వం కొడుకు కదూ? దిస్ టైమ్ ఐ విష్‌యూ ఏ డాటర్" అన్నాడాయన.

రాజు ఒక్కక్షణం ఊరుకుని "రెండురోజుల సెలవు కావాలి సార్. బెజవాడ పోయి రావాలి" అన్నాడు.

"అలాగే!..ఈ డ్రాఫ్టులు రెండూ చూసి వాటితో పాటే లీవ్ లెటర్ కూడా పంపించు" అన్నాడాయన ఒకఫైలు ముందుకు యిస్తూ.

రాజు తల వూపి ఫైలు అందుకొని బయటికి వచ్చాడు.

* * *

బెజవాడలో బస్సుదిగిన రాజుకి, ఎదురుగా కాంటీన్ దగ్గర ఎవరో అమ్మాయితో నవ్వుతూ మాట్లాడుతూ నిలబడి వున్న మూర్తి కనిపించాడు. రాజు అటుకేసి నడిచాడు. ఆవిడతో మాట్లాడుతూ ముఖం యిటు తిప్పిన మూర్తి మిత్రుడ్ని చూసి "అరె! ఎప్పుడొచ్చావురా!" అన్నాడు.

"ఇప్పుడే" అన్నాడు రాజు ఆ అమ్మాయిని క్రీగంట చూస్తూ.

మూర్తి ఆమెని పరిచయం చేసి "వస్తాను ఊర్మిళగారూ! మీ ఆయన్ని అడిగానని చెప్పండి" అని మిత్రుడి బుజాల మీద చెయ్యివేసి "పద" అన్నాడు.

బస్‌స్టాండులోంచి రోడ్డు మీదికి వచ్చాక "ఏమిటలా హఠాత్తుగా ఊడిపడ్డావు?" అన్నాడు మూర్తి.

"కాత్యాయని రమ్మని రాస్తే వచ్చాను" అన్నాడు రాజు అతని వంక నిశితంగా చూస్తూ.

మూర్తి నవ్వు ముఖంతో "ఏం రాసిందేమిటి?" అన్నాడు.

రాజు జేబులోంచి ఉత్తరం తీసి అతని కందించాడు.

మూర్తి ఆ ఉత్తరం చదువుతూన్నంతసేపు రాజు అతని ముఖం వైపే చూశాడు. చిన్నపాటి మందహాసం మినహా అతని మొఖంలో ఎలాంటి మార్పూ కనపడలేదు. చదవడం పూర్తి చేశాక "సరాసరి అక్కడికి వెడతావా? మా యింటికొచ్చి వెడతావా?" అన్నాడు మూర్తి.

"మీ యింటికి రావడం అవసరమా?" అడిగాడు రాజు.

"వస్తే సంతోషిస్తాను."

"పద"

ఇద్దరూ మూర్తి యింటికి వచ్చారు. మూర్తి తల్లి కుశలప్రశ్నలకి జవాబు చెప్పి, మూర్తి గదిలోకి వచ్చిన రాజు 'ఈ గ్రంథమంతా తల్లికి తెలియదన్నమాట?' అనుకున్నాడు. కూచున్నాక "ఏమిట్రా ఈ గొడవ?" అన్నాడు రాజు.

మూర్తి వెంటనే జవాబు చెప్పలేదు. రాజు వంక తదేకంగా కొద్దిసేపు చూసి "మీ చెల్లెలు నేను విడిపోతున్నాం రాజూ!" అన్నాడు.

రాజు "ఛ" అన్నాడు బాధతో అసహ్యంతో.

"ఔన్రా! నాతో కాపరం చెయ్యలేనని పుట్టింటికి వెళ్ళిపోయింది."

"ఎందుకని?"

"రాత రాజూ! రాత" అన్నాడు మూర్తి.

అతని కళ్ళు అశ్రుసిక్తాలవడం రాజు గమనించాడు. కంట తడిపెట్టే మగవాళ్ళంటే అసహ్యించుకునే మూర్తికి కన్నీరా? ఏమిటో చెప్పరాదురా?" అన్నాడు రాజు.

"చెబుతాను బ్రదర్! ఇదంతా విని నువ్వు నన్ను అసహ్యించుకుంటావు. నాకు తెలుసు. కాని దయవుంచి నీ చెల్లెలిని మాత్రం అసహ్యించుకోకు అది నేను భరించలేను.

"నీకు సత్యవతి గుర్తుందా? జడ్జి చలపతిరావుగారి అమ్మాయి. ఆ అమ్మాయికి యీమధ్యనే పెళ్ళయింది. వారం పదిరోజుల క్రిందట మొగుడితో సహా మా యింటికి వచ్చి నాలుగైదు రోజులుండి వెళ్ళింది.

"నీకు తెలుసుగా! ఆ అమ్మాయి నేను ఒకప్పుడు చాలా స్నేహంగా వుండేవాళ్ళం. అప్పట్లో ఆ స్నేహాన్ని ఆ అమ్మాయి అపార్థం చేసుకున్నది. ఒకరోజున నా దగ్గరేదో నవల పట్టుకుపోయి తిరిగి యిస్తూ అందులో ప్రేమలేఖ పెట్టి యిచ్చింది. నేను లేకపోతే తాను బ్రతకలేనని, నాతో పెళ్ళి కాకపోతే తాను ఉరిపోసుకుంటానని ఆ ఉత్తరం తాత్పర్యం.

"ఆ ఉత్తరం చదివినప్పుడు నాకు చాలా బాధ కలిగింది. ఆ అమ్మాయికి ఏం సమాధానం చెప్పాలో



తోచక కొద్దిరోజుల పాటు ముఖం చాటేసుకుని తిరిగాను. చివరికొక రోజున నా మనసులో అభి ప్రాయం — ఆమెని చేసుకోవాలని నాకు లేదని తెలుపుతూ ఉత్తరం రాశాను.

"ఆతర్వాత కొన్నాళ్ళు ఆమెకీ నాకూ మాటల్లేకుండా పోయాయి. చివరికొక రోజున, ఏమనుకుందో ఏమో, తనంతట తానే మా యింటికొచ్చి పలకరించింది. జరిగిందంతా మర్చిపోమ్మని, స్నేహితులుగానే వుందామని అన్నది. ఆమె అంటే నాకు ఎలాంటి కోపమూ లేదు గనుక సరేనన్నాను.

"ఆతర్వాత వాళ్ళ నాన్నగారికి మరో ఊరు బదిలీ కావడం, సత్యవతి వైజాగ్‌లో ఎం. ఎ. చదవడానికి వెళ్ళడం నీకు తెలిసినవేగా? పెళ్ళి శుభలేఖ వచ్చేవరకు ఆమె ఎక్కడ వుందో కూడా నాకు తెలియదు. శుభలేఖ చూశాక మళ్ళీ ఉత్తరం రాశాను—రాలేకపోతున్నందుకు ఏమీ అనుకోవద్దని, శుభాకాంక్షలనీ చెబుతూ, వీలైతే యిద్దరు కలిసి రావలసిందని కూడా ఆహ్వానించాను.

"ఆ ఆహ్వానం మీదనే వాళ్ళిద్దరూ యిక్కడికి వచ్చారు. ఏదో మాటల సందర్భంలో ఆ ఉత్తరాల ప్రసక్తి వచ్చిందిట. "మీ ఆయన చాలా బాగా రాస్తారు. ఆయన ఉత్తరాల్ని స్నేహితులందరూ అపురూపంగా దాచుకొంటారు. నాకూ ఆయన చాలా ప్రేమగా ఉత్తరాలు రాశారు" అన్నదిట.

"ఆ పైనే నేనేమీ చెప్పను. నువ్వేఊహించుకో" ముగించాడు మూర్తి. రాజు ఒక్కక్షణం ఊరుకుని "ఎన్ని అబద్ధాలు చెబుతావురా?" అన్నాడు జాలిగా.

"అబద్ధాలా?"

"నిజానికి జరిగిందింతేనా? ఈమాత్రానికే కాత్యాయని పుట్టింటికి వెళ్ళిపోయిందా?"

"నమ్మకపోతే నీ ఖర్మ ! జరిగింది మాత్రం అంతే."

"నా ముఖం చూసి చెప్పు"

మూర్తి నవ్వడానికి ప్రయత్నిస్తూ "ఏమిటను కుంటున్నావు నువ్వు?" అన్నాడు.

ఆ ప్రశ్నకి జవాబు చెప్పవలసిన అవసరం లేదని రాజుకు తెలుసు. ప్రాణం మీదికి వచ్చిన ఈనాడు గాని సత్యవతి తనకి ఉత్తరం రాసిందని చెప్పని మూర్తి, అంత తేలిగ్గా అసలు విషయం ? చెబుతాడని రాజు అనుకోవడంలేదు. కాని తన మనసులో ఉన్న అనుమానం బయట పెడితే మూర్తి తన మీద తారామండలానికి లేస్తాడు.

"ఏమిట్రా ఆలోచిస్తున్నావు ?" అన్నాడు మూర్తి.

"ఏంలేదు.. సరే! నేను కాత్యాయని దగ్గరికి వెళ్తొస్తాను." అన్నాడు రాజు లేస్తూ.

"అలాగే" అని "అన్నట్లు నిన్న ఏలూరు నుంచి పూతరేకులు తెప్పించాను. పూత రేకులంటే మీ చెల్లెలికి ప్రాణం. కాసినిస్తాను. పట్టికెళ్ళు." అన్నాడు మూర్తి.

రాజు అతని ముఖం వంక పరీక్షగా చూశాడు. మనసులో హాలాహలం దాచుకుని, పైకి నిబ్బరంగా వుండగలగడం ఎంతటి త్యాగానికి నిదర్శనమో ఆక్షణాన రాజుకి అర్థమైనట్లు తోచింది.

రాజు కదలబోతూ "సత్యవతి భర్త పేరు శంకరం. కదూ?" అన్నాడు.

మూర్తి ముఖం పక్కకి తిప్పుకుని "ఔను" అన్నాడు.

రాజు అనుమానం తీరిపోయింది. శంకరం కాత్యాయనికి చాలా దగ్గిర చుట్టం. కాత్యాయని మూర్ఖంగా ప్రవర్తించకపోతే, ఈ వెర్రివెధవ తన కోసం కట్టిన స్వర్గం ఆ కి దూరం కాదు.' అనుకున్నాడతను. ఒకసారి మిత్రుడ్ని తనివిదీరా కౌగలించుకుని, అతనిచ్చిన పొట్లాం చేతబట్టుకుని, భారంగా అడుగులు వేస్తూ రోడ్డు మీదికి వచ్చాడు రాజు. ●

కుటికురా
ఆయింట్ మెంట్
మీ చర్మాన్ని గురించి
మంచిశ్రద్ధ వహిస్తుంది

కుటికురా ఆయింట్ మెంట్ మొటిమలు, సూరేడుకాయలు మరియు పొక్కులను తొలగించేందుకు మీ చర్మంలో చాలా లోతుకు వెడుతుంది. కాలుట, ఒరసిన లేక పొడి చర్మము, కందిన చర్మము, కోసుకొనుట, పురుగు కాట్లు, గజ్జి మొదలైన చర్మ వ్యాధులకు ఉపశమనము కలిగిస్తుంది. బడలిన శరీరాన్ని ఉత్తేజపరచి మృదువుగా నున్నగా వుండేలా వుంచుతుంది.

కుటికురా ఆయింట్ మెంట్

చర్మ రక్షణకు ప్రపంచమంతా ప్రఖ్యాతి పొందింది.

2 సైజులలో లభిస్తోంది